# అతివృష్టి, అనావృష్టి

పూర్వం ఒకానొక నగరంలోని ప్రజలందరూ చాలా చురుగ్గా ఉండేవారు.

నడిచి వెళ్ళి చేసే పనులన్నీ వాళ్లు పరుగెత్తి వెళ్లి చేసేసేవారు. వాళ్ళ భోజనానికి ఒక్క నిముషంకన్నా ఎక్కువ పట్టేది కాదు. ఎంత పెద్ద పుస్తకమైనా ఒక గంటలో చదివి పారేసేవారు. అక్కడి కవులంతా నిద్రపోతూన్న సమయంలో కూడా కావ్యాలూ కథలూ అల్లేసేవారు. పనివాళ్లు ఎంత బరువైన పని ఐనా ఒక్క క్షణంలో చేసిపెట్టేసి, 'ఇంకా పని చెప్పండి!' అని అడిగేవారు.

పని అంతా ఇట్టే ఐపోతూ ఉండడంవల్ల ఎవడికీ తగినంత పని లేనట్టుగా కనపడేది. ప్రజలకు ప్రొద్దస్తమానం చేతినిండా పని ఉండేటట్టు చెయ్యకపోతే నిరుద్యోగ సమస్య వచ్చి దానిమూలాన ఏ ఉపద్రవమైనా రావచ్చు. 'నిముష నిముషానికీ కొత్త పని కల్పించడమన్నా కష్టమే గనుక, ప్రజలలో ఉండే చురుకుతనమే తగ్గించాలి' అని ఆ నగరం రాజుగారు నిశ్చయించుకున్నారు

'ఇది ఎలా సాధ్యమౌతుంది?' అని రాజుగారు మంత్రితో ఆలోచించారు.

"ప్రజలకి బద్ధకం అలవాటయేటట్లు చేస్తే సరి. ఒక చాటింపు వేయిద్దాం" అన్నాడు మంత్రి.

ఆ మర్నాడు నగరమంతటా, "బద్ధకస్తులకు బహుమతీలూ, బిరుదులూ, ఉద్యోగాలూ ఇస్తారు టోహోయ్, రాజుగారు!" అన్న చాటింపు వినిపించింది.

ఆ నగరప్రజ ఎందులోనైనా చురుకైనవాళ్లే గనుక ఆ చాటింపును వినీ వినడంతోనే ఇట్టే సోమరితనాన్ని అలవాటు చేసేసుకున్నారు!

## పాలంకి వెంకట రామచంద్రమూర్తి

ఆ సంవత్సరం తమ జన్మదినోత్సవ సమయంలో రాజుగారు ఇచ్చిన బిరుదులన్నీ పాత ఫక్కీలో కాక, బద్ధకం సంపాదించడంలో నేర్పు చూపినవాళ్ళకే ఇవ్వబడ్డాయి. 'బద్ధకప్రవీణ', 'బద్ధక శిరోమణి', 'బద్ధక మహామహోపాధ్యాయ' - ఇలాంటి బిరుదులన్నీ చాలామంది సంపాదించుకోకలిగేరు.

దరిమిలా ఒకనాడు రాజుగారు మంత్రిని వెంటబెట్టుకుని షికారుకు వెళ్ళేరు. వారికి ఎక్కడ చూసినా నిద్రమొద్దులూ, ద్రాక్షిగా త్రాగుబోతులూ, బడుద్ధాయిలూ ఎదురై, కూచున్న వాళ్లు లేవలేకుండానూ లేచినవాళ్లు అడుగు వెయ్యలేకుండానూ ఉండి, క్షణక్షణానికీ ఆవులిస్తో కనపడ్డారు.

వాళ్ళని చూసేసరికి రాజుగారికి ఒక సరదా పుట్టింది. మంత్రితో "వీళ్ళలో మిక్కిలి బద్ధకస్తుల్ని ముగ్గుర్ని ఏరండి. బహుమతీలు ఇద్దాం" అన్నారు.

మంత్రి ఒక్కసారి పరికించేసరికి, ఒకచోట కాలు అంతా కాలిపోయి పెద్ద పుండుఐన ఒకమనిషి కనపడ్డాడు. "ఏమిరా అబ్బీ, నీ కాలు ఇలాగ ఎందుకు కాలింది?" అని అడిగేడు మంత్రి.

వాడు, "రాత్రి చలి కాగుతున్నాం ప్రభూ. 'మంట దగ్గిరసా వచ్చింది. కాస్త జరుగు!' అంది నా భార్య. బద్ధకంగా ఉండి, 'ఆ, ఎవడు జరుగుతాడు!' అని అక్కడే ఉండిపోయాను. గుడ్డా, గుడ్డతో బాటు కాలూ అంటుకున్నాయండి." అని చెప్పి, ఆవులిస్తో ఒక్కసారి కళ్లు మూశాడు. వాడి నిద్రకు భంగం కలిగించడం ఎందుకని తోచి, రాజుగారు ఒక నూరు వరహాలు బహుమతీగా వాడి కొంగున మూట కట్టించి మంత్రితో ముందుకు సాగేరు.

పది బారలు వెళ్లేసరికి జోడు తొడుక్కుని నడుస్తూన్న వాడొకడు కుంటుతూ ఎదురయాడు.

మంత్రి, "ఏమోయ్, కుంటుతున్నావు?" అని అడిగేడు

"చెప్పులో సూదిలాంటి రాయి

(48-వ పేజీ చూడండి)

# ★ అతివృష్టి, అనావృష్టి ★

[43 వ పేజీ తరువాయి]

ఒకటి చేరి గుచ్చుకుంటోంది బాబూ?" అన్నాడు వాడు.

"అలా బాధపడుతూ నడవక పోతే జోడు విప్పి, రాయి తీసి అవతల పారెయ్యరాదా?" అన్నాడు మంత్రి.

"ఇప్పుడు పనిగట్టుకుని జోడు ఎవడు విప్పతాడు?" అన్నాడా బద్ధకస్తుడు.

మంత్రి రాజుతో, "ప్రభూ, ఇతనికి రెండవ బహుమానం ఇప్పించండి" అన్నాడు.

వానికి డబ్భై ఐదు వరహాలిప్పించి రాజుగారు ముందుకు నడిచారు.

కొంతమేర వెళ్లేసరికి అక్కడ ఒకడు జోగుతో కనపడ్డాడు. బారెడు త్రాచుపాము ఒకటి జరజరా వచ్చి పక్కనుంచి పోతోంటే వాడు చూసికూడా కదిలేదుకాదు.

రాజుగారు ఆశ్చర్యపోయి, "ఏమిరా, పామొచ్చినా కదిలేవు కాదు?" అన్నారు.

"బద్ధకం బాబూ?" అన్నాడు వాడు.

మూడవ బహుమానం యాభై వరహాలూ వాడికిప్పించి రాజుగారు అంతఃపురానికి వెళ్లిపోయారు.

కొన్నాళ్ళు పోయాక మంత్రి రాజుగారితో, "ప్రభూ, ప్రజలలో ఇప్పుడు ప్రతీవాడూ కూడా బహుమతి సంపాదించగలిగేటంత బద్ధకస్తుడైపోయాడు!" అన్నాడు.

ఆయన చెప్పదలచుకున్నదేదో ముగియకుండానే ఇద్దరు మనుష్యులు ఆ నగరం రక్షకభటాధికారిని సాయంపట్టి తీసుకొచ్చి రాజుగారి ముందు పడేశారు.

"ఏమిటిది?" అన్నారు రాజూ, మంత్రీకూడాను.

వాళ్లు, "ప్రభూ, ఈ అధికారి తన కళ్ళముందు ఒక హత్య జరుగుతోంటే చూసి ఊరుకున్నాడు! తమతో ఫిర్యాదు చేద్దామని తీసుకొచ్చాం. నడవమంటే కదిలేదు కాదు. అందువల్ల మోసుకు రావలసి వచ్చింది" అన్నారు.

రాజు రక్షకభటాధికారితో, "నీ కళ్ళముందే నేరం జరుగుతోంటే ఎందుకు ఊరుకున్నావ్, అడ్డుకోక?" అన్నారు.

రక్షకభటాధికారి రాజుముందు లేచి నిలపడబోయి కూలబడ్డాడు. నిద్రమత్తుతో "ప్రభూ, బద్ధకం చేతనే అడ్డుకోలేకపోయాను!" అన్నాడు.

దానితో రాజుకి కోపంవచ్చింది. "ఆ బద్ధకం ఏమిటో వదలగొట్టేస్తాను! హంతకునికి బదులు నిన్ను ఉరి దీయిస్తాను!" అంటూ వెంటనే ఉరితాడురప్పించి ఆ అధికారికంఠానికి తగిలించాడు.

నిలపడి చూస్తోన్న వాళ్ళంతా "క్షమార్పణ కోరుకోవయ్యా!" అని ఆ అధికారిని హెచ్చరించారు.

ఆ అధికారి "క్షమించండ"ని కోరితే వదిలేద్దామనే ఉంది రాజుగారికి. కాని రక్షకభటాధికారి తాడుపీక్కి- బిగిసిపోతోన్నా మాటలాడకుండా బద్ధకంగా అలాగే ఉండిపోయాడు

ఆఖరికి రాజుకే జాలి పుట్టి, "మంత్రీ, ఈ కత్తిని వాడికిచ్చి, ఆ ఉరిత్రాటిని కోసేసుకుపొమ్మను!" అన్నాడు.

మంత్రి కత్తి నిచ్చి, "కోసేసుకు పారిపో!" అని హెచ్చరించాడు. కాని అధికారి కత్తిని జారవిడిచేశాడు!"

"ఏం, ప్రాణంమీద తీపిలేదా నీకు?" అన్నాడు మంత్రి ఆశ్చర్యపడుతో.

"ఉంటే ఉండొచ్చుగాని, చచ్చు ప్రాణంకోసం ఈతాడంతా ఇప్పుడు ఎవరు కోస్తారు? బద్ధకంగా వుంది, నన్ను తిప్పలు పెట్టకండి!" అంటూ అధికారి, మత్తుగా కళ్లు మూసుకున్నాడు.

మంత్రి చేసేదిలేక తనే ఆ వురిత్రాడును కోసేసి ఆ మనుష్యుల చేతనే ఆ అధికారిని యింటికి మోయించేశాడు.

రాజువద్దకు వచ్చి, "ప్రభూ, ఇంక మనం సోమరితనాన్ని ప్రోత్సహించరాదు. కాస్త చురుకుపాలు తగ్గిద్దామని చూస్తే అతివృష్టిఅల్లా అనావృష్టి అయి ఊరుకుంది. దేశంలో మచ్చుకైనా ఇంక చురుకుతనం లేకుండా పోయేటట్లుంది. ఈ అధికారివంటి సోమరి చక్రవర్తులు తయారైతే ఇంకేమైనా ఉందా? నగరానికి ముప్పు వస్తుంది" అని మనవిచేసి, మంత్రి మళ్ళీ చురుకుతనంకోసం టముకు వేయించాడు. ★

అన్నిరకములైన కెమేరాలు, ఫిల్ములు వగైరా ఫోటోగ్రఫీ సామానులు సరసమైన ధరలకు............

ఫోటో ఆర్టు సెంటర్

(లజ్) మైలాపూర్.